# అపరంజి

చల్లని సంధ్యవేళ. సన్నని పిల్ల తెమ్మెరలు పలకరిస్తుంటే, వన్నెవన్నెల పూలు, వయ్యారంగా ఊగుతూ తమ స్నేహపు గుర్తుగా కమ్మతావులను బహుమతి ఇస్తున్నాయి. వాటికి ఓ వైపు అంతా పూల తీగెలతో, పొదలతో, మరో ప్రక్కన కూరగాయల పాదులతో అలరారుతున్న ఆ తోట మధ్యలో సిమ్మెంటు తిన్నె మీద కూర్చుని ఆహ్వాన పత్రాలకు చిరునామాలు రాస్తున్నది అపరంజి.

'అమ్మడూ! ఆ కవర్లు ఇటియ్యమ్మా, నేను వ్రాస్తాను.'

'అమ్మాయ్! ఆ వ్రాసినవి ఇలా ఇచ్చెయ్యి. ఎక్కడెక్కడ ఇవ్వాలో ఇచ్చివస్తాను.'

'ఊరికే ప్రయాస పడిపోతున్నావు. మాకు ఎవ్వరికీ ఒక్క పని కూడా చెప్పవు. ఈ పండుగ మా అందరిదీ కదమ్మా! తిని కూర్చుంటే మాకు ఊసుపోవడం లేదు.'

'ఏమమ్మా మనవరాలా, మాట్లాడవు? మాకు పనులు ఏమైనా చెప్పేది ఉందా లేదా?'

కళ్ల జోళ్లు సర్దుకుంటూ, తెల్లని పంచెలు రెపరెపలాడించుకుంటూ అపరంజి చుట్టూ తాతయ్యలు.

'భలేవారే మీరంతా. మీరేమీ చెయ్యకుండానే ఈ నవనందనం ఇలా రూపుదిద్దు కుందా? మీరు ఎవ్వరూ తిని కూర్చోవడం లేదు. కాని ఈ వయస్సు లో మీకు కావల్సింది విశ్రాంతే. మీరంతా విశ్రాంతిగా, ఆరోగ్యంగా ఉంటేనే ఈ నవనందనం నవ్వులొలికేదీ. నేను గుండెలనిండా ఆనందాన్ని అనుభవించేదీ.' అంటున్న అపరంజికి సన్నగా భక్తిగీతాలాపన చెవిన పడింది. చిట్టమ్మమ్మ భక్తి పారవశ్యంతో భగవన్నామాన్ని సంగీతంలో పాదిగి అంటుంటే అమ్మమ్మలు, బామ్మలు అందుకొని పాడుతున్నారు. రాత్రి ఎనిమిది గంటలు దాటిపోయిందన్న మాట. వీళ్లెవ్వరికీ ఫలహారాల ధ్యాసే లేదు. అసలు ఈ పూట ఏమి తయారు చేశారో ఏమిటో. తాతయ్యలన్నట్టు తను ఈ పనిలో మునిగి పోయింది. అపరంజి నెమ్మదిగా లేచి కర్ర ఆసరాతో లోపలికి నడిచింది. రామకృష్ణ హరే! పాండురంగ హరే! శ్రావ్యంగా సాగిపోతోంది భజన. ఎంత దివ్యానుభూతి! తను ఎంత అదృష్టవంతురాలు! అలానే నిలబడిపోయింది.

'అపరంజమ్మా! టిఫిను రడీ అయిపోయింది. మీదేలేటు. మీరు చెప్తే కాని ఎవ్వరూ లేచిరారు. వేళదాటిపోతే వాళ్ళకే బాధ. నేను చెప్తే ఎవ్వరూ వినిపించుకోరు. అందరినీ

కదిలించండమ్మా!' అన్నపూర్ణ మాటలకి తుళ్ళిపడింది అపరంజి.

'అమ్మమ్మో! ఇంక మంగళ హారతి పాడేసి రండి. ఫలహారాలు చల్లారి పోతున్నాయి.' అంటూ వీళ్ళనీ, భారతాలు, భాగవతాలు, రామాయణ పఠనాలు గీతాపారాయణాలు అప్పటికి ఆపించి వాళ్ళనీ లాక్కెళ్ళింది.

అంతా కలసి కూర్చొని ఫలహారాలు చేస్తుంటే తను ఏవేవో కబుర్లు చెప్తూ అన్నపూర్ణతో కలసి వడ్డిస్తూంది అపరంజి. ముడతలు పడ్డ ఆ ముఖాల్లో ఎంత సంతోషం! ఎక్కడెక్కడ నుండో వచ్చిన వీళ్ళంతా తన నవనందనంలో ఒకటయ్యారు. ప్రాంతీయ భేదాలు, కులమతాల తేడాలు పట్టించుకోరు.

'ఏమిటి డేవిడ్ తాతయ్యా! ఈ రుబ్బురొట్టి నీకు నచ్చలేదా? అరే మస్తాన్ తాతయ్యా! నువ్వుకూడా అలానే ఉంచేశావు. నీకూ సయించలేనట్టుంది. రేపు చపాతీ చేయిస్తానులే.'

'అదేంకాదు చిట్టితల్లీ! వాళ్ళిద్దరికీ కూడా రుబ్బురొట్టి చాలా ఇష్టమేలే. మమ్మల్నందరినీ పసిపిల్లల్లా సాకుతున్న నీ దొడ్డ మనసు కట్టి పడేసింది. ఈ తిండితిప్పల కోసం, గూడు నీడల కోసం పడ్డ అవస్థలు గుర్తుకొచ్చాయి.'

'బేటీ! రమణయ్య మాటలు నిజం. ఆలోచనలో ఉండి మరచిపోయేమే తప్ప నువ్వు పెట్టిన ఫలహారం ఏదైనా అమృతం కాదూ!' తినడం మొదలు పెట్టాడు మస్తాన్.

"నేను ఎప్పుడూ అనుకుంటూ ఉంటాను ఈ బంగారు తల్లికి సరిపడిన పేరు ఎవరుపెట్టారో! మన అపరంజి మనసు నిజంగా బంగారమే.' అప్పుడే అరుగైలో అడుగు పెడుతున్న లక్ష్మీకాంతమ్మ వ్యాఖ్యానం.

అపరంజి మనసులో అమ్మమ్మ రూపం మెదిలింది. తనకీ పేరు పెట్టి ఎంతో అపురూపంగా పిలుచుకొనేది అమ్మమ్మ. తనని ప్రాణంగా పెంచింది.

తనకి ఊహ తెలిసినప్పటి నుండి 'కుంటికులాసం' అంటూ అంతా చీదరించుకొనేవారు. తనకీ నలుగురి మధ్యకీ వెళ్ళాలనీ, తోటిపిల్లల్లా పరుగులు పెడుతూ ఆడుకోవాలనీ ఎంతగానో అనిపించేది. అన్నయ్యలు బంతి ఆట ఆడుతూ ఉంటే ముచ్చటగా చూసేది.

'చూడ్డం తప్ప, అడ్డంవచ్చా ఏమైనానా? ఆడకపోతే పోయిందిరా! మీ చెల్లాయి ఎలా దెయ్యం కళ్లు పెట్టి చూస్తోందో, మనం ఆడేటప్పుడు! అలా చూస్తూ కూర్చోవద్దని చెప్పు. మాకేదోలా ఉంటుంది. మన ఆటకి దిష్టి తగులుతుంది కూడా!'

అన్నయ్యలు, వాళ్ళ స్నేహితులు తలోమాట అంటుంటే తనకు ఎంత దుఃఖం వచ్చేదని! ఏడుస్తున్న తనని అమ్మమ్మ ఎంత ఆప్యాయంగా ఎత్తుకొనేది. అమ్మమ్మ భుజానికి తలానించి 'నేను అందరిలా పరిగెత్తలేను, ఆడుకోలేను, బడికి కూడా వెళ్ళలేను.' అంటూ బావురుమనే

తనని ఎంతప్రేమగా ఓదార్చేది. బుగ్గలపై ముద్దుల వర్షం కురిపించి కన్నీళ్ళు తుడిచేసేది.

'పోనీలే! వాళ్ళందరూ ఆటలాడుకుంటే నేను నీకు పాటలు నేర్పుతాను. బడికి వెళ్ళక్కర్లేకుండానే చదువు నేర్పుతానమ్మా! మాయదారి పోలియో నిన్ను అవిటిదాన్ని చేసింది కానీ . . . నీకేం తెలివితేటలు తక్కువా తల్లీ! ఆడపిల్లవని, అవిటిదానివని చులకన భావంతో మీనాన్న నిన్ను బడికి పంపట్లేదు కానీ . . . . లేకపోతే ప్రతిక్లాసులో ఫస్ట్ వచ్చేదానివి. అసలు నేను ఎంత మొత్తుకున్నా అతగాడు చెవిన పెట్టాడా? ఇప్పుడేం కొంపలు మునిగి పోయాయి అంటూ నీకు పోలియో డ్రాప్స్ అయినా వేయించాడు కాడు. జ్వరంతో నువ్వు విలవిలలాడిపోతూ ఉంటే వైద్యం చేయించాలని అన్పించలేదమ్మా! ప్రమోషన్ గొడవలో అదేదో ఊరెళ్ళిపోయాడు. మీ . . . అమ్మే ఉంటే నిన్ను అలా. . . వదిలేయగలిగేదా? అతను తిరిగి వచ్చేసరికి నీకీ .కుంటితనం ప్రాప్తించింది.' తన పసితనాన్ని తలచుకొని అమ్మమ్మ ఆవేదన పడేది. రోజురోజుకీ నాన్నగారికి తనంటే విసుగు ఎక్కువ కాసాగింది. చీటికీ మాటికీ తిట్టడం కొట్టడం చేసేవారు. ఏదో వంకపెట్టి అమ్మమ్మనూ సాధించేవారు. తనని కొడుతున్నప్పుడు అమ్మమ్మ అడ్డుకోబోతే మరీ విరుచుకు పడేవారు. 'పెట్టి పోషించేవాళ్ళకి కొట్టుకొనే హక్కుంటుంది. అయినా దీని మొహం చూస్తే మహాపాపం. ఈ నష్టజాతకురాలి మూలానే ఈ ఇంటికి ఆడదిక్కు లేకుండా పోయింది. తల్లితో పాటు ఇదీ చస్తే పీడ వదలిపోయేది.'

అలా నాన్నగారు ఎన్నెన్నో మాటలు అంటూంటే అమ్మమ్మ కుళ్ళికుళ్ళి ఏడ్చేది.

'అంతలేసి మాటలనకు బాబూ! కాస్తపెద్దయితే ఈ చిట్టితల్లే నీ ఇంటి వెలుగవుతుంది. దానికీ జ్ఞానం వస్తోంది. మనస్సెంత నొచ్చుకొంటుంది.' అంటూ నచ్చచెప్పేది. తనమీద మమత లేని నాన్నగారికి అమ్మమ్మ ఏం చెబితే తలకెక్కుతుంది?

అమ్మస్థానంలోకి మరో స్త్రీ రావడంతో ఆ ఇంట ఉండలేక పోయింది అమ్మమ్మ. అత్తయ్యనూ, మామయ్యనూ ఒప్పించి తనని కూడా మామయ్యగారింటికి తీసికొని వెళ్ళిపోయింది.

అమ్మమ్మ తనని తీసుకొని వెళ్ళిపోతూ ఉంటే నాన్న ఆనందించాడు. ఆ ఊరు వెళ్ళగానే అమ్మమ్మ తనని స్కూల్లో వేసింది. తన చదువుకోసం అమ్మమ్మ పేర ఉన్న పొలం, ఆమె వంటి మీది ఒక్కో నగ హరించుకుపోయాయి. అందుకు అమ్మమ్మ బాధపడలేదు సరికదా తను ఒక్కోమెట్టూ ఎక్కుతూ ఉన్నత విద్యావంతురాలయినందుకు తెగ సంబర పడిపోయింది. తన పట్ల అమ్మమ్మ కున్న ఆపేక్ష చుట్టుప్రక్కల వాళ్ళని ఆశ్చర్యపరచి వాళ్ళ కబుర్లలో చోటుచేసుకుంది. ఈ కుంటికులాసం అంటే ఆ ముసలావిడకు ఎంత ప్రేమో! కాకిపిల్ల కాకికి ముద్దంటారు మరి. ఎవరైనా చేసుకుంటామంటే పెళ్ళి కూడా చేస్తుందేమో! అనేవారు అత్తయ్యతో.

'ఆ! ఎలా కుదురుతుంది? ఎంత చదువుకున్నా ఉద్యోగం వెలగబెట్టినా కుంటిది కుంటిదే కదా! ఆవిడెందుకో దాన్ని అలా నెత్తిన పెట్టుకొని ఊరేగుతుంది.' అనేది అత్తయ్య. ఆ మాటలు చెవిన పడినా తను పట్టించుకొనేది కాదు. పొరపాటున అమ్మమ్మ విన్నా ఊరుకొనేదీ కాదు.

'దాన్ని అనురాగంతో చూసుకొనే వాళ్ళు దొరకాలే కాని నా ప్రాణం ఇచ్చైనా దాని పెళ్ళి జరిపిస్తాను. కాకిపిల్ల కాకికి ముద్దు అన్నమాట ఎలా ఉన్నా, అందరూ పట్టనట్టుంటే దాని బ్రతుకేమవుతుంది?' అంటూ నోళ్ళకి తాళాలు వేసేది.

అమ్మమ్మ సంకల్పబలమో, తన అదృష్టమో తనకాళ్ళమీద తను నిలబడగలిగింది. తనకి లెక్చెరరుగా ఉద్యోగం వచ్చినపుడు, అనుపమ్ తనని కోరివరించి తన జీవితంలో కళ్యాణఘడియ అడుగుపెట్టినపుడు అమ్మమ్మ ఆనందానికి అవధులు లేవు. అమ్మమ్మకి తను దూరం అయిపోయింది. తను బదులు రాసినా రాయకపోయినా అమ్మమ్మ మాత్రం నెలకి మూడు నాలుగు ఉత్తరాలైనా వ్రాసేది. ప్రతినిత్యం తలపుల్లో మెదిలినా కాలం గడిచేకొద్దీ మనస్సులో మరుగున పడసాగింది. అమ్మమ్మ నుంచి ఉత్తరాలు రావడం ఆగిపోయినా గమనించనేలేదు. హఠాత్తుగా ఒకరోజు తను కాలేజీ నుండి వచ్చేసరికి ఇంట్లో అమ్మమ్మ! తను వెళ్ళగానే వచ్చినట్లుంది. వంటమనిషి వడ్డిస్తే భోజనం చేసి తనకోసం ఎదురుచూస్తూ కూర్చుంది. అనుపమ్ తనకంటే ముందుగానే వచ్చినట్లున్నాడు. ఆవిడతో కబుర్లు చెబుతూ ఆపిల్‌ముక్కలు, బిస్కట్లు తినమని బలవంతం చేస్తున్నాడు. తనని చూడగానే 'ఎన్నాళ్ళకి చూశానే' అంటూ వాటేసుకుంది. అపరంజిని చూడగానే ఆవిడలో కలిగినంత స్పందన అపరంజిలో లేదు. 'బాగున్నావా!' అంది ముక్తసరిగా.

'ఏంబాగే తల్లీ! ఇప్పుడు మీ మామయ్యకి ఈ ముసలితల్లి బరువైపోయింది. మీ అత్తయ్యతో ఒక్కరోజు గడపడం కూడా నాకు కష్టమైపోతోంది. నువ్వు తెచ్చిన నిక్షేపాలేవీ యిక్కడలేవు. ఉన్నదంతా ఊడ్చి ముద్దుల మనవరాలికే పెట్టావుగా! దాని దగ్గరికే వెళ్ళు. అంటూ తరిమేశారు. ముసలిముండని! ఎలా బతుకు ఈడుస్తానే తల్లీ!' అమ్మమ్మ దుఃఖం కట్టలు తెంచుకుంది.

అపరంజికి విసుగనిపించింది. 'డ్రెస్సుమార్చుకొని వస్తానుండు!' అంటూతన గదిలోకి వెళ్ళిపోయింది. ఒక్కవారం కూడా అమ్మమ్మని తన ఇంట్లో వుంచుకోలేదు అపరంజి. ఉన్న నాలుగు రోజులు తప్పించుకొని తిరిగింది. ఎక్కువ సమయం ఇంట్లోనే ఉండేది కాదు. 'అవసరంలో ఆదుకోవడానికి నువ్వెందుకు సంకోచిస్తున్నావో నాకు అంతు పట్టటం లేదు.' అన్నాడు అనుపమ్.

'ఎప్పుడో, ఆవిడేదో చేసిందని యిప్పుడు నేలకు పోయేదాన్ని నెత్తికి ఎత్తుకోనక్కర లేదు. పని ఎక్కువైందంటే ఇంట్లో పనివాళ్ళు చిరాకు పడతారు. రేపోమాపో ఈ ముసలావిడ కాస్తా మంచానపడితే మనకి ఎవరూ పిలిస్తే పలకరు.' అర్థరాత్రయినా నిద్రపట్టక మంచం మీద అటూయిటూ దొర్లుతున్న అమ్మమ్మకి ఆ మాటలు చెవిన పడడంతో మనవరాలి ఆంతర్యం అవగతమైపోయింది. మరునాడే కొడుకింటికి వెళ్ళిపోయింది.

'మీ మనవరాలి భోగం అయిపోయిందా! పువ్వుల్లో పెట్టి పూజిస్తుందని వెళ్ళావు. కళ్ళల్లో పెట్టి కాపాడుతుందనుకున్నావు. పట్టుమని పదిరోజులయినా తిరగకుండా తిరుగు టపాలా

ప్రత్యక్షమయ్యావు.' అలాంటి ఎన్నెన్నో మాటలతో చిత్రహింసలకు గురైన ఆమెకు మౌనమే శరణ్యమయింది.

అమ్మమ్మని ఇంట్లోనుంచయితే వెళ్లగొట్టిందిగాని అమ్మమ్మ అపరంజి మనసులోంచి పోలేదు. "అమ్మమ్మని బలవంతంగా వెళ్ళగొట్టింది తను. ఆ యింట ఉండలేకనే కదా దైన్యంగా తన దగ్గరికి వచ్చింది! ఒకవేళ అమ్మమ్మ ఏమైనా అయిపోతే అందుకు తను బాధ్యురాలు కదూ! తననెంతో ప్రేమగా సాకిన అమ్మమ్మ. కొడుకు ఆదరణకు నోచుకోక దిక్కులేని పక్షిలా తన ఆశ్రయం కోరింది. తనెంత స్వార్థపరురాలైపోయింది?" ఈ మోస్తరు ఆలోచనలు అపరంజి మనసులో చోటు చేసుకొనేవి. ఐనాసరేమరుక్షణం వాటిని చెదరగొట్టే ప్రయత్నం చేసేదే తప్ప పశ్చాత్తాపంతో అమ్మమ్మను తిరిగి తీసుకురావాలనే భావనకు చోటిచ్చేదికాదు. "పెద్దకాలంలో కొడుకు దగ్గరే ఉండాలి వాళ్ళే చూసుకోవాలి తప్ప మనుమరాలి యింటిలో ఉండడమేమిటి? లోకవిరుద్ధం" అని తనను తాను సమాధాన పరచుకొనేది.

ఫలితం- అమ్మమ్మ తన యింటినుంచే కాదు; ఈ లోకం నుంచే వెళ్ళిపోయింది. కొన ఊపిరితో ఉన్నప్పుడు కూడా అమ్మమ్మ తననే కలవరించిందట. అమ్మమ్మకు తనపట్ల ఉన్న ఆపేక్షలో రవ్వంత తనకి ఉన్నా ఇంత ఘోరం జరిగేది కాదు. అమ్మమ్మ శేష జీవితం తన యింటనే ప్రశాంతంగా గడిచిపోయేది. ఇప్పుడనుకొని ఏం ప్రయోజనం? టెలిగ్రాం అందుకొని తను వెళ్ళేసరికే పంచప్రాణాలు తమమీద పెట్టుకున్న అమ్మమ్మ ప్రాణాలు అనంత వాయువుల్లో కలసిపోయాయి. అప్పుడు తన మనస్సును పిండేసిన దుఃఖం వెల్లువైంది. 'నీ మూలంగానే బెంగపెట్టుకొని మంచం పట్టింది. ఏమాత్రం ప్రేమగా చేరదీసినా ఇంత తొందరలో ఆమె బ్రతుకు ముగిసిపోయేదికాదు' అంటూ మందలించాడు అనుపమ్.

'అదేనండి! నా పొరపాటే అమ్మమ్మను బలితీసుకొంది. ఆ పుణ్యమూర్తిని చేజేతులారా పోగొట్టుకొన్న పాపాత్మురాలిని.'

భార్యపట్ల ఎంత ప్రేమానురాగాలున్నా ఆ క్షణాన ఏహ్యాభావం కలిగింది అనుపమ్‌కి. నమ్ముకొని వచ్చిన ఆ వృద్ధురాలిని స్వార్థం పేరుకుపోయిన మనస్సుతో నిర్దాక్షిణ్యంగా పంపేసి ఇప్పుడు పశ్చాత్తాపపడితే ఏం లాభం?

'నువ్వు నెలల తరబడి నిద్రాహారాలు సరిగా లేకుండా ఈ మోస్తరుగా ఉంటే మన సంసారం ఏంకావాలి? ఊరికే నీ ఆరోగ్యం పాడుచేసుకోవటం ఎందుకు?' లాలనగానే అందామనుకున్నా కటువుగానే పలికింది అతని స్వరం.

'మీరెన్నైనా చెప్పండి నా తప్పిదం నన్ను వెంటాడకమానదు.'

'నీ ప్రవర్తనకు నవ్వాలో ఏడ్వాలో తెలియడం లేదు. ఒక్క నువ్వే ఏమిటి మన సమాజమే ఇలా ఉంది. ప్రతి సంసారంలోనూ ఉన్నదే ఇది. కాస్త వయస్సులో పైబడ్డవాళ్లు తమతో ఉండడం భారమనే భావిస్తారు. వాళ్ళని మానసికంగా హింసిస్తారు. అనారోగ్యవంతులుగా, అశక్తులుగా

తయారై బ్రతికినన్నాళ్ళు కుమిలిపోతూ కాలంనెట్టుకు రావాల్సిందే.' కోపంలో, ఆవేదనలో భర్తనోట వస్తున్న మాటలు అపరంజిలో ఒక విచిత్రమైన చైతన్యాన్ని కలిగించాయి.

అంతే! ఆమె అహర్నిశలు శ్రమించింది. భార్య చేస్తున్నది సత్కార్యమని గమనించాక అనుపమ్ అండదండలు లభించాయి. అదే ఇప్పటి నవనందనం.

అపరంజికి తృప్తిగా ఉంది. నవనందనంలో తన ప్రేమానురాగాలు పొందుతున్న వారందరూ అమ్మమ్మలూ, తాతయ్యలే. అందరిలోనూ తనకి అమ్మమ్మ కన్పిస్తుంది.

'చెప్పవే అమ్మమ్మా! ఇప్పటికైనా నన్నుక్షమించగలిగావా? ఈ మనవరాలు కనీసం నీకు ఆత్మశాంతినైనా కల్గించగలిగింది కదూ!' వార్షికోత్సవం రోజున అమ్మమ్మ ఫోటోకు పూలదండ అలంకరిస్తూ అనుకొంది అపరంజి.

●